పత్రీజి జయంతిలో 'గ్రీన్ ఇండియా చాలెంజ్'

ట్రస్ట్ ఆవరణలో మొక్కలు నాటిన సభ్యులు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ): మహేశ్వర మహా పిరమిడ్ గురువు పత్రీజి జయంతి సందర్భంగా సోమవారం కడ్తాల్‌లోని ట్రస్ట్ ఆవరణలో సభ్యులు మొక్కలు నాటారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉన్నదని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. లక్షలాది మొక్కలు నాటిన ..ఈ మహాకార్యంలో తమను కూడా భాగస్వామ్యం చేసిన సంతోష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాధవి, నిర్మల, చంద్రశేఖర్, ఉమా, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వచ్చారు.. సేవలు ఆపేశారు..!

- ఖైరతాదాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి ఆకస్మిక సెలవు
- ఇదేం పద్ధతి అంటూ వాహనదారుల ఆగ్రహం
- సోమవారం స్లాట్ బుక్ చేసుకున్న వారికి నేడు సేవలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి ఓ ప్రభుత్వ కార్యాలయానికి వస్తున్నారంటే.. అక్కడ ప్రజలకు అందించే సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేలా ఏర్పాట్లు ఉంటాయి. కానీ ఆ సేవలను పూర్తిగా నిలిపివేయడం రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీఏ) అధికారులకే చెల్లింది. ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏఏంవీఐలకు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. దీంతో సోమవారం ఆర్టీఏ సేవల కోసం స్లాట్ బుక్ చేసుకున్న 170 మందికి చుక్కెదురైంది. సీఎం కార్యక్రమం ఉన్న నేపథ్యంలో ఆఫీసుకు సెలవు ప్రకటించినట్టు వాహనదారులకు అధికారులు సందేశాలు పంపారు. ఆర్టీఏ అధికారులు అకస్మాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు సేవలు నిలిపివేసి చేసిన ఘనకార్యం ఏంటో చెప్పాలని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక ఏర్పాట్లు చేసి సేవలు కొనసాగించాల్సిందిపోయి.. ఉన్న సేవలను రద్దు చేసి తమ సమయం వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రాకతో ఆర్టీఏ కార్యాలయంలో సెలవు వాతావరణం కనిపించింది. కౌంటర్లన్నీ బంద్ చేశారు. ఉద్యోగులు కార్యాలయంలో ఎక్కడా కనిపించలేదు. దీంతో వాహన సేవల కోసం వచ్చిన వారు వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. సోమవారం స్లాట్ బుక్ చేసుకున్న వారికి మంగళవారం సేవలు అందిస్తామని ఆర్టీఏ అధికారులు తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే అగ్నిగుండమే

- విద్యార్థుల పాట్టకొట్టి.. కాంట్రాక్టర్ల జేబులు నింపుతుండ్రు
- సర్కారుపై ఆర్ కృష్ణయ్య ఫైర్
- 16న తరగతుల బహిష్కరణ, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి పిలుపు

అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు(మాజీ ఎంపీ)ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, నవంబర్ 11: విద్యార్థుల పొట్టకొట్టి కమీషన్ల కోసం కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫీజు బకాయిలు చెల్లించకుంటే 16న తరగతుల బహిష్కరణ, తహసీల్, ఆర్డీవో, కలెక్టరేట్లను ముట్టడిస్తామని పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణయ్య మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా ఇంతవరకు స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. 14లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు రూ.4వేల కోట్ల లేవు కానీ, కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లులు ఎలా పాస్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్ ఖర్చు వివరాలపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కోర్సు పూర్తయినా కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగాలను పొందలేకపోతున్నారని తెలిపారు. పెరిగిన ధరల ప్రకారం కాలేజీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను ఏడాదికి రూ.5500 నుంచి 20వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 3 రోజుల్లో బకాయిలు చెల్లించాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్‌లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, గజ్జ సత్యం, సీ రాజేశ్, లాల్‌కృష్ణ, అంజి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కందాడై ఇకలేరు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కందాడై రామానుజాచార్యులు(82) ఆదివారం తుది శ్వాస విడిచారు. బీఏ లిటరేచర్ చదివి డాక్టరేట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఆయన టీటీడీ దేవస్థాన కళాశాలలో లెక్చరర్, ప్రిన్సిపాల్‌గా, బోర్డు మెంబర్‌గా సేవలు అందించారు. భగవత్ విషయాన్ని, శ్రీ భాష్యాన్ని విషదీకరించడంలో ప్రావీణ్యం కలిగిన ఆయన హరివంశ మహాపురాణం వంటి ఎన్నో గ్రంథాలు రచించారు. అభినవ వ్యాస ప్రవచన వారధి, ప్రవచన శిరోమణి, వేద విభూషణ, జ్యోతిర్ విజ్ఞాన భాస్కర జ్ఞాన సరస్వతి వంటి బిరుదులు ఆయనకు దక్కాయి. ఆన్‌లైన్ వేదికగా విదేశాల్లోని విద్యార్థులకు కూడా విద్యాబోధన చేస్తున్నారు. న్యూనాగోల్‌లో ఉన్న ఆయన నివాసానికి వైష్ణవ సేవా సంఘం సభ్యులు, పలు ఆలయాల ప్రధాన అర్చకులు దేవనాథ స్వామి, వేణుస్వామి, కందాళ రత్నమాచార్యులు, మాజీ ఎంపీ వేణుగోపాలచారి వంటి ప్రముఖులు సంతాపం ప్రకటించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపండి

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలపాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో కమిషన్ చైర్మన్ అక్తర్ సోమవారం బాధ్యతలను స్వీకరించి మాట్లాడారు. ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన వినతులు, అభిప్రాయాలు, అభ్యర్థనలను ఎస్సీ సంఘాలు, వ్యక్తులు కమిషన్ కార్యాలయ పనివేళల్లో నేరుగా వచ్చి తెలపవచ్చని వివరించారు.

అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటాం

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బీ వెంకటేశ్వరరావు

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం ప్రజలందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు వెల్లడించారు. సోమవారం బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ కోసం మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో బహిరంగ విచారణ చేపట్టింది. చైర్మన్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు లోబడి బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను నిర్ధారిస్తూ నివేదికను రూపొందిస్తామని వెల్లడించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందే

- సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరైనవే
- హైకోర్టులో కొనసాగిన వాదనలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లలో సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులే జారీ చేశారని బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది జే ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంపై దాఖలైన కేసుల్లో సింగిల్ జడ్జి గత సెప్టెంబరు 9న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు రెండు అప్పీళ్లను దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణను కొనసాగించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ఆఫీసుకు, ఇంటికి పిటిషన్లను రిజిస్టర్ పోస్టులో పంపితే తీసుకోలేదని తెలిపారు. అందుకే హైకోర్టుకు రావాల్సి వచ్చిందన్నారు. కోర్టులో సవాలు చేయడాన్ని ప్రశ్నిస్తున్నారు కానీ, తాము ఇచ్చిన అనర్హత పిటిషన్లపై ఏం నిర్ణయం తీసుకున్నారో ఎలాంటి స్పష్టతనివ్వడం లేదని చెప్పారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ విధులు నిర్వహించాల్సిందేనని పేర్కొన్నారు. అనర్హత పిటిషన్లపై తేల్చాల్సింది స్పీకరేనని, ఈ విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరిధిలోనే ఉన్నట్లు స్పష్టం అవుతుందని తెలిపారు.

మధ్యంత ఉత్తర్వుల జారీకి నిరాకరణ

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో, సభ ఓటింగ్‌లో గానీ పాల్గొనకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని ప్రజాశాంతి పార్టీ అధినేత కేపీ పాల్ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. అనర్హత పిటిషన్లపై తేల్చకుండా ఇలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. రాజకీయాలకు కోర్టులను వేదికగా మార్చవద్దని హితవు చెప్పింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

భూమిపై హక్కును సివిల్ కోర్టులే తేల్చాలి

- అధికారులు నిర్ధారించడానికి వీల్లేదు
- హైకోర్టు, సుప్రీంలకూ అధికారం లేదు
- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ భూములపై హక్కులను ధ్రువీకరించాల్సింది అధికారులు కాదని, సివిల్ కోర్టు మాత్రమే తేల్చాలని హైకోర్టు తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు, హైకోర్టులకు కూడా ఆ అధికారం లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, కలెక్టర్, ఆర్డీవోలకు ఆ అధికారం లేదని చెప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా తూప్రాన్‌పేట్ గ్రామంలోని సర్వే నం.122లోని రెండెకరాల భూమికి హక్కులను ధ్రువీకరిస్తూ స్వాధీన పత్రాన్ని జారీ చేయడాన్ని సవాలు చేస్తూ నార్లకొండ మల్లయ్య ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి సోమవారం విచారించారు. 1985లో సాదా బైనామా ద్వారా ఈ భూమిని కొనుగోలు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది చెలికాని వెంకటయాదవ్ తెలిపారు. క్రమబద్ధీకరణ దరఖాస్తు పెండింగ్‌లో ఉండగా భూమిని విక్రయించిన వ్యక్తి, అతని కొడుకు వెంకటరెడ్డి, అధికారుల సాయంతో భూమిని ఇతరులకు అమ్మేసి హక్కు పత్రాన్ని పొందారని వివరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ పంపిన రిపోర్టు ఆధారంగా కలెక్టర్ ప్రతివాదులకు భూస్వాధీన పత్రాన్ని జారీచేశారని చెప్పారు. సివిల్ కోర్టు నిర్వహించాల్సిన విధులను అధికారులు నిర్వహించడానికి వీల్లేదని గుర్తుచేశారు. దీనిపై కింది కోర్టు యథాతథ స్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

శిక్షలు పడేలా చార్జిషీట్స్ వేయండి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : నిందితులకు శిక్షలు పడేలా చార్జిషీట్స్ వేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆబ్కారీ భవన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది 31 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఎన్డీపీఎల్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఎక్సైజ్ శాఖలో నలుగురు అధికారుల పర్యవేక్షణలో 90 మందిపైగా సిబ్బంది ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్నారని, ఒక్కొక్క టీమ్ తమదైన ప్రతిభ చూపిందని కొనియాడారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌టీఎఫ్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి 'ఆపరేషన్ దూల్‌పేట్'లో మంచి ఫలితాలు సాధించారని, ఎస్‌టీఎఫ్ టీం లీడర్ ప్రదీప్‌రావు రేవ్ పార్టీల్లో అల్పోజలం అమ్మే కీలక వ్యక్తిని అరెస్టు చేశారని, సివిల్ పోలీస్ విభాగంలో డీఎస్పీ తిరుపతియాదవ్, తుల శ్రీనివాసరావు పనితీరు మెరుగ్గా ఉందని అభినందించారు. ఢిల్లీ, హర్యానా, గోవా ప్రాంతాల నుంచి వచ్చే ఎన్డీపీఎల్‌పై దృష్టిసారించాలని సూచించారు. ఎక్సైజ్ జేసీ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ – శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



BLOCKBUSTER నేడే చూడండి
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHEER VARMA
సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కోఠిపేట్ 11.15,2.30,9.45
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45
తాళ్ళూరి - ఇ.సి.బి.ఎల్ 11.15,2.15,6.15,9.15
AMB ఎఎంబి - గచ్చిబౌలి 1.40,4.30,7.40,10.20
ఎఎఎ - అమీర్‌పేట్ 7.40,10.35PM
ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 10.45PM
PVR ఆర్.కె - బంజారాహిల్స్ 11.30,8.15PM
PVR సింధ్రమాల్ - పంజాగుట్ట 1.20,4.25,7.15PM
PVR ఇనిఫినిటీమాల్ - మాదాపూర్ 11.00,2.00,7.55PM
PVR నెక్టస్ మాల్ - కూకట్‌పల్లి 11.00,1.45,7.55,10.50
PVR సరలియా - పంజాగుట్ట 5.25PM
PVR పీవిఆర్ - ఎర్రమంజిల్ 2.30,5.15,10.40PM
PVR పీవిఆర్ - మూసాపేట్ 11.00,8.25,11.00PM
PVR ప్రెస్టిజ్ ప్రైమ్ - గచ్చిబౌలి 11.10,8.05PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 1.45,4.50PM
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 10.50,2.35,7.55PM
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 11.15,5.15PM
Cinepolis చందు మాల్ - కూకట్‌పల్లి 10.20AM
Cinepolis